వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

న్యాయదేవత కొత్తరూపు

చిహ్నాలు, పేర్లు మారిపోతున్న యుగంలో మనం జీవిస్తున్నాం. మద్రాస్ పేరు చెన్నైగా, అలహాబాద్ ప్రయాగరాజ్‌గా, కలకత్తా కోల్‌కత్తాగా మారిపోవడం మనం చూశాం. అయితే వీటివెనుక రాజకీయ అంశాలు ఉండటమూ తెలిసిందే. కానీ, తాజాగా న్యాయవ్యవస్థకు ప్రతీక లాంటి న్యాయదేవత రూపురేఖలు, అంటే విగ్రహం రూపురేఖలు మారిపోయాయి. న్యాయస్థానాల అలంకరణలో భాగమైపోయిన ఈ విగ్రహం భారతీయ సంస్కృతిలో పదే పదే ప్రస్తావనకు వచ్చే అంశంగా మారింది. ప్రజల నిత్య వ్యవహారంలో 'చట్టానికి కళ్లు లేవు' వంటి వ్యక్తీకరణలు అందులో భాగమే. ఇప్పుడా విగ్రహం గత చరిత్ర అయిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. సరికొత్త విగ్రహం తెరమీదకు రావడమే అందుకు కారణం. ఈ మార్పు వెనుక రాజకీయాలు గానీ, తీర్మానాలు గానీ లేవు.

సుప్రీంకోర్టు ఆవరణలో సీజేఐ డీవై చంద్రచూడ్ ఇటీవల ఆవిష్కరించిన నూతన న్యాయదేవత విగ్రహం మారుతున్న ఆలోచనా ధోరణులకు అద్దం పట్టింది. న్యాయదేవత ఆహార్యం, హస్త భూషణాలు మారిపోయాయి. ప్రాచీన యూరప్ తరహా వస్త్రధారణ పోయి అచ్చమైన భారతీయతకు ప్రతీక లాంటి చీరకట్టు వచ్చిచేరింది. ఒక చేతిలో త్రాసు అలాగే ఉన్నప్పటికీ రెండో చేతిలో ఉండే కత్తి రాజ్యాంగ గ్రంథంగా మారిపోయింది. అన్నింటికన్నా కొట్టొచ్చినట్టు కనిపించే మార్పు కండ్ల గంతలు కనుమరుగై పోవడం. మనకు పాత న్యాయదేవత విగ్రహ భావన బ్రిటిష్ వలస పాలకుల నుంచి వారసత్వంగా సంక్రమించింది. బ్రిటిషు వారు దానిని రోమన్ పురాణాల నుంచి తీసుకున్నారు. జస్టీషియా అనే దేవతకే రూపమిచ్చి న్యాయస్థానాల్లో నిలిపారు వారు. కండ్లకు గంతలు సమభావనకు ప్రతీక అని అంటారు. నిజానికి న్యాయవ్యవస్థ గుడ్డిదనే మధ్యయుగాల విమర్శల నుంచి గంతలు వచ్చాయనే వాదన ఉంది. ఇక త్రాసు ఇరుపక్షాల వాదనలను నిష్పాక్షికంగా తూకం వేసి తీర్పు చెప్పాలన్న భావనకు ప్రతీక. కత్తి అనేది న్యాయవ్యవస్థకు శిక్షించేందుకు గల అధికారాన్ని సూచిస్తుంది. కొత్త విగ్రహంలో కత్తి స్థానంలో రాజ్యాంగం రావడం అనేక అర్థాలు తెలియజేస్తున్నదని చెప్పవచ్చు. న్యాయ వ్యవస్థకు రాజ్యాంగమే సర్వోన్నతమనే భావన అందులో ఇమిడి ఉన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో దీని ప్రాముఖ్యం ఏమిటో అందరికీ తెలిసిందే. ఇక గంతలు పోవడం విషయానికి వస్తే ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు 'మేం అన్నీ గమనిస్తున్నాం' అని పదే పదే జారీ చేస్తున్న హెచ్చరికలకు సూచన కావచ్చు. ఇక ఎవరూ 'న్యాయం గుడ్డిది' అని అలవోకగా అనజాలరు.

స్వదేశీయతకు పెద్దపీట వేస్తూ తెచ్చిన మార్పులను స్వాగతించాల్సిందే. అయితే, ప్రతీకల మార్పు కన్నా న్యాయవ్యవస్థ స్ఫూర్తిని సంరక్షించాల్సిన అవసరం ఎంతో ఉన్నది. పెండింగ్ కేసుల బెడద వెంటాడుతూనే ఉన్నది. అమాయకులైన అండర్ ట్రయల్స్ లక్షలాది మంది జైళ్లల్లో మగ్గుతున్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఎంతగా నొక్కిచెప్తున్నా బెయిలు కన్నా జైలు వైపే వ్యవస్థ మొగ్గుతున్నది. న్యాయం సంపన్నులకే దక్కుతుంది, పేదోళ్లకు అందని పండుగానే ఉండిపోతున్నదనే విమర్శలూ ఉన్నాయి. ఇలాంటి జాడ్యాల తొలగింపు దిశగా అడుగులు పడితేనే మారిన విగ్రహానికి సార్థకత ఏర్పడుతుంది. విగ్రహం చేతిలో రాజ్యాంగం ఉన్నట్టుగానే ఆ రాజ్యాంగం సమకూర్చిన హక్కులకు అన్నివిధాలా రక్షణ లభించే రోజులు వస్తే అంతకన్నా కావాల్సింది ఏముంటుంది?

ముఖ్యమంత్రికి గౌరవనీయత అక్కరలేదా?

టంకశాల అశోక్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గమనించినప్పుడు తరచూ ఆశ్చర్యం కలుగుతుంటుంది. ఆయన పట్ల ఈ పది నెలల కాలంలో గౌరవనీయత ఏర్పడకపోవటమన్నది సరే సరి. కానీ, అంతకన్న ముఖ్యంగా తనకు అసలు గౌరవనీయతే అక్కరలేదన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఆశ్చర్యం కలగటం అందువల్లనే. ఎవరి పట్లనైనా కొన్ని విషయాలలో గౌరవం కలగవచ్చు, మరికొన్నింటిలో కలగకపోవచ్చు. అది సహజం. కానీ, రేవంత్‌రెడ్డికి సంబంధించి అసలు ఎందులోనైనా గౌరవనీయత ఉందా? అంటే ఆలోచించవలసి వస్తుంది. ఈ తెలుగు సీమను 1953-56, 1956-2014 నుంచి మొత్తం 20 మంది పాలించారు. వారిలో సమర్థులు, అసమర్థులున్నారు. ప్రతిష్ఠ గలవారు, లేనివారు ఉన్నారు. కానీ, గౌరవనీయత కలగకపోవటమే గాక అటువంటిది అవసరమే లేదన్నట్టు వ్యవహరించినవారు ఒక్కరంటే ఒక్కరైనా కన్పించరు.

రేవంత్‌రెడ్డి విషయానికి వస్తే, తనకు పరిపాలనాపరమైన అనుభవం లేనందున ఎన్నో కొన్ని తప్పటడుగులు వేయవచ్చు గాక. సమస్య అది కాదు. అనుభవం లేదని ప్రజలకు తెలియటమే గాక ఆ మాట తానే ఒప్పుకున్నందున, కొన్ని తప్పటడుగులను ప్రజలు కొంత కాలం అర్థం చేసుకొని ఉపేక్షించగలరు. అదే విధంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చెప్పిన గడువు ప్రకారం అత్యధిక భాగం అమలుచేయకపోయినా, ఆ కారణంగా తగినంత నిరసన ఉన్నప్పటికీ, ఆర్థిక పరిస్థితులు బాగా లేవని కొంతకాలం ఓపిక పట్టండనీ సానునయంగా చెప్పినట్టయితే, అది కూడా ఒక మేరకు అర్థం చేసుకోగలరు. ఇటువంటివన్నీ పరిపాలనాపరమైనవి. వీటిలో వైఫల్యాలు విశ్వసనీయతను తగ్గించవచ్చు. నిరసన కలిగించవచ్చు. కానీ వీటన్నింటికి భిన్నంగా, గౌరవనీయత రావటం రాకపోవటమన్నది వ్యక్తిగతమైన వ్యవహరణ, భాషకు సంబంధించినటువంటిది. సమస్య అక్కడ వస్తున్నది.

ఇక్కడ జాగ్రత్తగా గమనించవలసిన మాట ఒకటున్నది. ఒకవైపు పరిపాలనాపరమైన తప్పటడుగులు, హామీలు అమలుచేయకపోవటానికీ, మరొక వైపు గౌరవనీయత ఉండటానికీ, లేకపోవటానికీ మధ్య సంబంధం ఉంటుంది. గౌరవనీయతను సంపాదించుకున్నట్టయితే ప్రజలు తప్పటడుగులను, హామీలు అమలుకాకపోవటాన్ని మామూలు కన్న కొంత ఎక్కువ కాలం ఉపేక్షిస్తారు. అట్లా సంపాదించుకొనకపోతే ఆ ఉపేక్ష మామూలు కన్న తక్కువ కాలంలో ఆవిరవుతుంది. రేవంత్‌రెడ్డి తీరును చూడగా ఆయన ఈ విషయం గ్రహించినట్టు కనిపించటం లేదు. ఆ స్థితిలో జరుగుతున్నదేమిటి? తప్పటడుగులు, హామీల అమలు వైఫల్యం, గౌరవనీయత లేమి అనే మూడు కూడా తనకు వ్యతిరేకంగా మోహరించి ముప్పేట దాడి వంటిది చేస్తున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొన్ని మాసాలకే మొదలైన ఈ స్థితి, నానాటికీ వేగంగా పెరుగుతూ, ఇంకా ఒక సంవత్సరమైనా పూర్తికాక మునుపే తీవ్రస్థాయికి చేరటం అసాధారణమని చెప్పాలి. తెలుగు నేలను పాలించిన ముఖ్యమంత్రులందరిలో మరెవరి విషయంలోనూ ఇట్లా జరగలేదు. అసాధారణ మనటం అందువల్లనే.

> **రేవంత్‌రెడ్డికి తెలిసి కూడా ఎందుకొరకో గాని ధ్యాసలో ఉంచుకోనివి మరికొన్ని ఉన్నాయి. వాటిలో అన్నింటికన్న ముఖ్యమైనది, ప్రమాదకరం కూడా అయినది కాంగ్రెస్‌లోని అధికార సంస్కృతి. పార్టీలోని గ్రూపులు, గ్రూపు ఒత్తిడితో తమ పనులు చేయించుకునేవారు కొందరైతే మొహం ఎదుట మెచ్చుకుంటూ వెనుక గోతులు తవ్వి తామే అధికారానికి రాజూసేవారు కొందరు.**

ఈ సంస్కృతి కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నదే. అందరికీ తెలిసిందే. ఆ బెడద బలవంతులు, సమర్థులైన ముఖ్యమంత్రులకే తప్పలేదు. ఇక బలహీనులైన వారి విషయం చెప్పేదేమున్నది. ఆ విధంగా చూసినప్పుడు, పైన పేర్కొన్న ముప్పేట దాడి వంటి పరిస్థితి, లేదా బలహీనత, రేవంత్ వ్యతిరేక గ్రూపు సంస్కృతికి బాగా కలసివచ్చేది. అట్లాగే జరుగుతున్నది కూడా. తనకు ఇది గతం నుంచే తెలిసినది కాగా ప్రస్తుతం ప్రత్యక్షానుభవం ద్వారా మరింత తెలిసి వస్తుండవచ్చు. అయినప్పటికీ ధ్యాసలో ఉంచుకొని ఎందుకు వ్యవహరించటం లేదో తెలియదు. లేదా అటువంటి ధ్యాసను తన మౌలిక వ్యక్తిగత సంస్కృతిలోని బలహీనతలు కప్పివేస్తునాయేమో చెప్పలేము.

రేవంత్‌రెడ్డి తెలిసి కూడా ధ్యాసలో ఉంచుకోని, లేదా అహంభావంతో లెక్కచేయక తోసిపుచ్చుతున్న విషయాలలో ఒకటి ఇది కాగా, బీఆర్‌ఎస్, బీజేపీ అనే రెండూ బలమైన ప్రతిపక్షాలనే వాస్తవాన్ని గుర్తించి వ్యవహరించకపోవటం మరొకటి. బీఆర్‌ఎస్ ఎన్నికలలో ఓడినా క్షేత్రస్థాయిలో తగినంత బలం ఉంది. వారికి అనుభవజ్ఞులు, తెలివికలవారు అయిన నాయకులున్నారు. అటువంటి పార్టీని మంచి పరిపాలనతో, హామీల అమలుతో, గౌరవనీయతను సంపాదించుకోవటంతో మాత్రమే బలహీనపరచగలరు. కానీ ఈ మూడు విషయాలలోనూ రేవంత్‌రెడ్డి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పుడు, బలహీనపర్చటం మాట అట్లుంచి, తానే వారికి ఆయుధాలను సమకూర్చుతున్నారు. అదెట్లా జరుగుతున్నదో నిత్యం కండ్ల ఎదుటనే కనిపిస్తున్నప్పుడు, మళ్లీ వివరించి చెప్పే అవసరం ఉండదు.

బీజేపీ సంగతి కూడా ఇంతే. వారు గతం కన్న పుంజుకోవటం అసెంబ్లీ ఎన్నికలలో, లోక్‌సభ ఎన్నికలలో కూడా కన్పించింది. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి సభ్యత్వం గణనీయంగా పెంచుకునేందుకు ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండటం, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టగల అవకాశం, అపారమైన ధనబలం ఆ పార్టీకి గల సానుకూలతలు. మత భావనలను పెచ్చరిల్లజేసేందుకు క్షేత్రస్థాయిలో కనిపించే ప్రతి అంశాన్ని ఉపయోగించుకుంటున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఆందోళనలలో పాల్గొంటున్నారు. తమతో మునుముందు చేర వచ్చుననుకునే కాంగ్రెస్ నేతలతో సంబంధాలలో ఉన్నారు. ఇవన్నీ రేవంత్‌రెడ్డి గమనించటం లేదని ఎంతమాత్రం అనుకోలేము. అయినప్పటికీ, పైన పేర్కొన్న మూడు విధాలైన వైఫల్యాల వల్ల ఏ విధంగానైతే బీఆర్‌ఎస్‌కు ఆయుధాలనిస్తున్నారో, బీజేపీకి కూడా అదే పద్ధతిలో ఇస్తున్నారు.

పైన పేర్కొన్న మూడు వైఫల్యాలన్నవే నిజానికి ఒక పెద్ద సమస్య. ఆ విషయాన్ని ఆయన గ్రహించగలిగితే వాటిని చక్కదిద్దుకోవటమే ఒక బృహత్తరమైన బాధ్యత. పరిపాలనలో క్రమంగా అనుభవాన్ని సంపాదిస్తూ తప్పటడుగులు పడకుండా చూసుకోవటం, కొండంత ఎత్తున నిలిచి ఆర్థిక స్థితిని భయపెడుతున్న ఎన్నికల హామీలను వైఫల్యాల వలయం నుంచి బయటకుతెచ్చి వివిధ వర్గాల ప్రజలను పూర్తిగా కాకున్నా తగినంత మేర సంతృప్తి పరచటం, మహా గందరగోళంగా మారుతున్న తన విశ్వసనీయతను, గౌరవనీయతను కనీసం ఇప్పటి నుంచైనా చక్కబెట్టుకోవటం మామూలు పని కాబోవటం లేదు. విచిత్రం ఏమంటే, వీటికివే కొండంత భారం కాగా, ఆ భారంతో ఇప్పటికే సతమతమై ఆందోళనకు, ఒత్తిడికి గురవుతున్న ఆయన, మరికొన్ని కొత్త భారాలను, ఆందోళనలను, ఒత్తిడిని చేజేతులా కొని తెచ్చుకుంటున్నారు. మూసీ, హైడ్రాల ఆలోచన కాకపోయినా వాటిని నిర్వహిస్తున్న తీరు అటువంటిదే. అదెంత ప్రణాళికా రహితంగా, అస్తవ్యస్తంగా సాగుతూ, రకరకాల పరస్పర విరుద్ధమైన మాటలు చేతలతో సమస్యలను ప్రజలకు, ప్రభుత్వానికి సృష్టిస్తున్నదో చూస్తూనే ఉన్నాము. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం పరీక్షల నిర్వహణ, రైతులకు రుణమాఫీతో పాటు రైతు భరోసా వంటివి కేవలం ముఖ్యమంత్రి అవకతవక ధోరణులు, నాలుగు రోజులకొక మాట తీరుతో పెద్ద తలనొప్పులుగా మారాయి. ఆరు గ్యారంటీల గురించి అయితే మాట్లాడకపోవటం మంచిది. వాటిపై బేఫికర్‌గా బుకాయింపులు, పదే పదే అవే అబద్ధాలు, ప్రతిపక్షాలకు సవాళ్లు చేసి పారిపోవటాలు తరచూ కనిపిస్తున్నాయి.

> **రోజులు గడిచేకొద్దీ పరిపాలనానుభవం గడించి, ప్రజలకు మెరుగైన ఫలితాలు చూపుతూ, తన పట్ల గౌరవాన్ని, విశ్వాసాన్ని పెంచుకోవలసిన ముఖ్యమంత్రి నానాటికి నేల చూపు చూస్తుండటాన్ని అందరూ గమనిస్తూనే ఉన్నారు. ఇందుకు అదనంగా ఆయన, పైన అనుకున్నట్టు అసలు గౌరవనీయత అన్నదే తనకు అక్కరలేదన్నట్టు వ్యవహరిస్తున్నారు. రోజూ మాటలు మార్చుతూ, లోపాలు ఎత్తిచూపే వారిపై దాడులు చేస్తూ, ఎప్పుడు ఏమి మాట్లాడుతారో తనకైనా తెలుసునా అనే అనుమానం కలిగిస్తున్నారు.**

ఈ మొత్తం ధోరణి కారణంగా అందరి దృష్టిలో చులకనవుతున్నారు. ఇప్పటికే చాలా అయ్యారు. ఆయనపై ఎవరికి ఏ విమర్శలు ఉన్నప్పటికీ, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి పరిస్థితి ఈ విధంగా ఉండటం తనకే కాదు, ఈ రాష్ట్రానికి, ప్రజలకు కూడా గౌరవప్రదం కాదు. తమను బట్టి తమ దేశానికి, రాష్ర్టానికి గౌరవం తెచ్చిన ప్రధానులు, ముఖ్యమంత్రులు అనేకులున్నారు. రేవంత్‌రెడ్డికి ఆ జాబితాలో చేరాలనే కోరిక అయినా ఉన్నట్టు లేదు.

సాగరహారాన్ని గుర్తుచేసిన లాఠీచార్జ్

జూపల్లి రమేష్
94925 70992

తెలంగాణ ఉద్యమంలో ఆన్యపుకాయ, సొరకాయ పేర్లు మార్మోగాయి. పుంటికూర, గోంగూర పేర్లు కూడా అదే స్థాయిలో వినిపించాయి. ఆన్యపుకాయ, పుంటికూర పేర్లు తెలంగాణ సొంతమైతే, మిగిలిన పదాలు మాత్రం పరాయి ప్రాంతానివి. రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తున్న సమయంలో కొంత మంది తీరును తెలుసుకోవడం కోసం ఉపయోగించిన ఈ పద ప్రయోగం ఎంతటి విజయాన్ని సాధించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఓ రకంగా తెలంగాణ సోయికి ఆన్యపుకాయ, పుంటికూర పేర్లు ప్రాథమిక ఆదర్శ సూత్రమయ్యాయి. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చెప్పినట్టుగా 'ఇడ్లీ, సాంబార్ గో బ్యాక్' మాదిరిగానే పై రెండు కూరగాయల పేర్లు కూడా అదే స్థాయిలో ప్రతిధ్వనించాయి. ఇదంతా ఇప్పుడు ఎందుకంటే స్వరాష్ట్రంలో పదేండ్లు తెలంగాణ సోయి అడుగడుగునా కనిపించింది. కానీ ఇప్పటి పాలకుల్లో ఆ సోయి క్రమంగా మాయమవుతున్నది. ఏనాడూ 'జై తెలంగాణ' అని నినదించని వ్యక్తులే పరిపాలనకు సారథ్యం వహిస్తున్న ఈ సమయంలో ఇలాంటిది కాక మరేం ఆశించినా తప్పు మనదే అవుతుంది. తెలంగాణ అంటేనే ఓ ఉత్తేజం. ఓ నూతనోత్సాహం. పోరాటానికి స్ఫూర్తి పదం. అలాంటి తెలంగాణను తిరిగి ఉద్యమకాలం నాటి పరిస్థితులకు నేటి పాలకులు తీసుకుపోతున్న తీరు చూస్తూంటే ఒళ్లు గగుర్పొడుస్తున్నది. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో మిలియన్ మార్చ్ తర్వాత అంత గొప్పగా జరిగిన నిరసన కార్యక్రమం సాగర

హారం. 2012, సెప్టెంబర్ 30న తలపెట్టిన సాగరహారంతో హైదరాబాద్ అతలాకుతలమైంది. అష్టదిగ్బంధనంతో సమైక్య పాలకుల కండ్లు బైర్లు కమ్మాయి. ఎక్కడికక్కడ ఉద్యమకారులను కట్టడి చేద్దామనుకున్న ఆంధ్రా పెత్తందారుల ఆలోచనలన్నీ బెడిసికొట్టాయి. పుట్టల నుంచి చీమలు బయటికి వచ్చినట్టుగా ఉద్యమకారులు గుంపులు గుంపులుగా వచ్చిపడ్డారు. నాడు అదీ ఉమ్మడి రాష్ట్ర సచివాలయం. ఎదురుగా బానిస సంకెళ్లకు గుర్తుగా తెలుగు తల్లి విగ్రహం. ఆ పక్కనే కొండా లక్ష్మణ్ బాపూజీ పూర్వపు నివాస ప్రాంతం జలదృశ్యం. ఆబిడ్స్ నుంచి వేల మంది పరుగులు తీస్తూ నెక్లెస్ రోడ్డుకు కదిలారు. కాగ్ బిల్డింగ్ నుంచి కొందరు, బీఎస్ఎన్ఎల్ నుంచి మరికొందరు, జీహెచ్ఎంసీ, ట్యాంక్‌బండ్ నుంచి తండోపతండాలుగా వస్తున్న ఉద్యమకారుల ఆవేశానికి సమైక్య బలగాలు కంగుతిన్నాయి. తెలుగుతల్లి ఫ్లై ఓవర్ కింద సచివాలయం జంక్షన్ వద్ద పోలీసు బలగాలు కసిగా లాఠీలు పట్టుకొని కొట్టేందుకు సిద్ధమవుతున్న పరిస్థితులు. ఓ వైపు సమైక్య ఖాకీల కవ్వింపులు, మరో వైపు ఉద్యమకారుల ఆక్రందనలు. వెరసి పోలీసుల లాఠీఛార్జి, బాష్పవాయువు ప్రయోగం, రబ్బర్ బుల్లెట్ల దాడి. ప్రతిగా ఉద్యమకారుల నుంచి రాళ్ల దాడి. దాదాపుగా గంటల కొద్దీ ప్రవాహంలా జరిగిన దాడి, ప్రతిదాడిలో నాటి కాంగ్రెస్ సర్కార్ వారి బల ప్రయోగం తలవొంచాల్సి వచ్చింది. క్షణాల్లో సాగరహారం జనహారమైంది. వేల నుంచి లక్షల మంది ఒకే గొంతుకగా 'జై తెలంగాణ' అంటూ నినదించారు. ఓ వైపు చీకటి పడుతున్నా, మరో వైపు భారీ వర్షమే కురుస్తున్నా ఉద్యమకారులంతా ఉక్కు పిడికిలితో బైఠాయించి కూర్చున్నారు. స్వరాష్ట్ర కోరికను నాటి పాలకులకు వినిపించారు. ఇదొక ఉద్విగ్న క్షణం. మరిచిపోలేని మహా రణం. 20 రోజుల కిందటే పుష్కర కాలాన్ని పూర్తిచేసుకున్న సాగరహారం ఘటన ఇప్పుడు మరోసారి యాదిలోకి వచ్చింది.

అచ్చం అలాగే.. సాగరహారం జరిగిన చోటనే, బుల్లెట్ల వర్షం కురిసిన ప్రాంతంలోనే అక్టోబర్ 19 శనివారం రోజు జరిగిన గ్రూప్-1 అభ్యర్థుల ఉద్యమ సెగ నాటి పరిస్థితిని కండ్లకు కట్టింది. పదేండ్ల కాలంలో ప్రజల ఆకాంక్షలు, ఆలోచనలకు తగ్గట్టుగా తెలంగాణ రాష్ట్రం పరుగులు తీసింది. అభివృద్ధిలో మేటిగా నిలిచింది. సొంత ఆలోచనలకు ప్రజల కోరికలను జోడించి ముందుకు పోవడంతోనే ఇదంతా జరిగింది. మంకుపట్టు లేకుండా ప్రజలు ఏమనుకుంటున్నారు? వారికేం కావాలి? అన్న ఏకైక ఆలోచనతోనే ఇదంతా సాధ్యమైంది. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. తెలంగాణ ప్రజలపై పాలకులకు ప్రేమాభిమానాలే కరువయ్యాయి. నాటి పరాయి పాలకులకు తొత్తులుగా మెదులుతూ ఉద్యమకాలాన్ని గడిపినవారికి జనాలపై ప్రేమ ఎక్కడ ఉంటుంది? ముమ్మాటికీ ఉండదు. అందుకు మూసీ బాధితుల ఆక్రందనలు ఒక్కటే సాక్ష్యం కాదు, నిన్న కాక మొన్న అక్టోబర్ 19న తెలంగాణ సచివాలయం ఎదుట జరిగిన ఉద్యమమే ఇందుకు ఉదాహరణ. తెలంగాణ ఏర్పాటుకు ఊపిరి పోసిన సాగరహారం ఉద్యమ ఘటనకు పుష్కరకాలం పూర్తి చేసుకున్న రోజుల వ్యవధిలోనే తెలంగాణ యువతపై తెలంగాణ పోలీసుల లాఠీలు విరగడం దారుణం. ఇంతకంటే దౌర్భాగ్యపు పరిస్థితి మరొకటి ఉండదేమో. నాడు, నేడు అదే జాతీయ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. వారి చేతల్లో మార్పు కనిపించడం లేదు. నాడు ఉద్యమకారులను తొక్కిపెట్టి తెలంగాణ ఏర్పాటును తొక్కేయాలని అడుగడుగునా ప్రయత్నం చేశారు. కానీ, వారంతా సమైక్యవాదులు. ఇప్పుడు తెలంగాణ వ్యక్తులే పాలకులుగా ఉన్నప్పటికీ వారి మనసుల్లో, వారి చేతల్లో తెలంగాణ యాస, తెలంగాణ భాష, తెలంగాణ అనే భావోద్వేగం కనిపించడం లేదు. ఒకవేళ ఆ సోయి ఉండి ఉంటే గ్రూప్-1 అభ్యర్థులపై, అందులో తెలంగాణ ఆడబిడ్డలపై కర్కశంగా, అన్యాయంగా లాఠీలు ఝుళిపించే పరిస్థితి ఉండకపోయేది.

జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీల మధ్య నిత్యం పోరు కొనసాగుతుంది కానీ, తెలంగాణకు వచ్చేసరికి మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటవుతున్నాయి. అందుకే ఆ ఇరు పార్టీలు రహస్య మైత్రిని కొనసాగిస్తున్నాయనే విషయం స్పష్టమవుతున్నది. 'రేవంత్ రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులు ప్రయత్నిస్తున్నారు' అని కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడటమే అందుకు ఉదాహరణ. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? బీజేపీ అనుబంధ ప్రభుత్వమా? అర్థం కాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఎందుకంటే ఆ రెండు పార్టీలు ఒకరికొకరు విమర్శించుకోవడం ఆపేసి ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌ను దూషిస్తుండటమే ఇందుకు తార్కాణం.

కాంగ్రెస్-బీజేపీ మిలాఖత్

చిటుకుల మైసారెడ్డి
94905 24724

రేవంత్ రెడ్డి సీఎం పదవి స్వీకరించిన తర్వాత కేంద్రం నుంచి రాష్ర్టానికి రావాల్సి నిధులు సరిగా రావడం లేదు. అయినా రేవంత్ కేంద్రంతోని పెద్దగా పేచీ పెట్టుకోవడం లేదు. ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి కిమ్మనకుండా ఉంటున్నారు. అధికారం చేజిక్కించుకోవడం కోసం ఆరు గ్యారెంటీల పేరిట లెక్కకు మించి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలలైనా ఆ హామీలను నెరవేర్చడం లేదు. పైగా హైడ్రా పేరిట తెలంగాణలో విధ్వంసం జరుగుతున్నదే తప్ప వికాసం వైపు అడుగులు పడటం లేదు. ముఖ్యమంత్రిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తెలంగాణ రాష్ర్టాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్దామన్న తపన ముఖ్యమంత్రిలో కనిపించకపోవడమే నేటి విషాదం.

ఎంతసేపూ రేవంత్ రెడ్డి ధ్యాస మొత్తం సీఎం పదవిని కాపాడుకోవడం కోసమే కానీ, ప్రజల బాగోగులు మాత్రం ఆయనకు పట్టడం లేదు. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాడు. బడా బాబులను భయపెట్టి ఢిల్లీకి కప్పం కడుతున్నాడు. 'ప్రభుత్వం' అంటేనే మంత్రుల సమాహారం. కానీ సీఎం ఒక దారి, మంత్రులు ఇంకోదారిలో ఎవరికి నచ్చిన పనులు వాళ్లు చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే ముఖ్యమంత్రులు. అందుకే ముఖ్యమంత్రికి, మంత్రులకు పొసగడం లేదనే గుసగుసలు రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్నాయి. ఇటీవల ఒక మంత్రి రాష్ట్రంలో పర్యటించడానికి హెలికాప్టర్ అడిగితే అధికారులు లేదని చెప్పారట. అంతే, ఆ మంత్రి అధికారులపై ఫైర్ అయ్యారని సమాచారం! 'నేను కూడా సీఎం స్థాయి వ్యక్తినే, నాకెందుకివ్వరు హెలికాప్టర్. మేం పదవీ త్యాగం చేస్తేనే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడ'ని ఆగ్రహం కూడా వ్యక్తం చేశాడట! ఈ అంతర్గత కలహాల వల్లనే సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీతో సఖ్యతగా మెదులుతున్నాడని కాంగ్రెస్ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. కాంగ్రెస్‌లో ఒకవేళ పరిస్థితులు అనుకూలించకపోతే బీజేపీలోకి జంప్ కావడానికి రేవంత్‌రెడ్డి దారులు వేసుకుంటున్నాడనే మాటలు ఇటీవల రాష్ట్రంలో జోరందుకున్నాయి.

రాష్ట్ర బీజేపీ నాయకుల వైఖరి కూడా అందుకు తగ్గట్టే ఉంటున్నది. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమైతే.. బీజేపీ నాయకులు తరచూ బీఆర్‌ఎస్ పార్టీని విమర్శించడమేమిటో విడ్డూరం కాకపోతే. సీఎం రేవంత్‌ను బండి సంజయ్ తరచూ పొగడటం, తాజాగా 'రేవంత్‌ను సీఎం కుర్చీ నుంచి దించేందుకు రాష్ట్ర మంత్రులు ప్రయత్నిస్తున్నార'ని వ్యాఖ్యలు చేయడం బీజేపీ, సీఎం రేవంత్ రెడ్డి రహస్య మైత్రిని బహిర్గతం చేస్తున్నాయి. ఈ తతంగం మొత్తాన్ని పరికించి చూస్తే ఏడాది నిండకముందే రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయేమోనన్న అనుమానాలు ప్రజలకు రేకెత్తుతున్నాయి. ప్రజలు కూడా రేవంత్ పది నెలల పాలనను చూసి విసిగి వేసారిపోయారు. ఇందిరమ్మ పాలన అంటే ఇండ్లు కట్టిస్తారేమోననుకున్నాం కానీ, ఇండ్లను కూలగొడ్తరనుకోలేదని వాపోతున్నారు. అవకాశం దొరికితే చాలు రేవంత్‌ను గద్దె దించేందుకు తహతహలాడుతున్నారు. 'ప్రజల్లో ఈ వ్యతిరేకత ఇంకా పెరగాలని మంత్రులు కూడా కోరుకుంటున్నారని, తద్వారా సీఎం సీటు నుంచి రేవంత్‌ను తప్పించవచ్చనేది మంత్రుల ఆలోచన' అని బండి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.

ఎవరు ఏ పార్టీలో ఉన్నారో తెలియడం లేదని ఇరు పార్టీల ద్వితీయశ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఏదేమైనా ఇటు రాష్ట్ర ప్రజలు, అటు కాంగ్రెస్ మంత్రులు సీఎం సీటుకు ఎసరు పెట్టారని, ఇది మనం అవకాశంగా తీసుకోవాలన్నదే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎత్తుగడ. అందుకోసమే రేవంత్‌ను పావుగా వాడుకుంటున్నది. అందుకే రేవంత్ కూడా బీజేపీతో సఖ్యతతో మెదులుతున్నాడు. దొంగలు.. దొంగలు ఊరు పంచుకున్నట్టు తెలంగాణ రాష్ర్టాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు పంచుకోవడమేమిటని రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)



16 మందిని కనండి

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి (తక్కువ జనాభా వృద్ధి కారణంగా) జరుగుతున్న నష్టాన్ని చూస్తుంటే ఒక్కో జంట 16 మంది పిల్లలను కనడం సరైనదేనని అనిపిస్తుంది. కంటే కనండి కానీ, వారికి తమిళ పేర్లు పెట్టండి.

- ఎంకే స్టాలిన్, తమిళ నాడు సీఎం